క్లుప్తంగా

నవగ్రహాలకు పూజలు


సంగమేశ్వరంలోని నవగ్రహాలు

బత్తలపల్లి: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వరంలో శనివారం నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు జయకుమార్, చంద్రస్వామి తెలిపారు. ప్రతి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేస్తారు. తైలాభిషేకం, నవధాన్యాల పూజ, నవగ్రహాల పూజ, రాహు కేతువుల పూజలు చేపట్టారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సంఘమేశ్వరంలో సతీసమేతంగా నవగ్రహాలు ఉన్నాయని అర్చకులు తెలిపారు. ఇక్కడి నవగ్రహాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి శనివారం ఇక్కడ పూజలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు వివరించారు.

వారపు సంత వేలం

నల్లమాడ: స్థానిక పంచాయితీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ భారతి అధ్యక్షతన నల్లమాడ వారపుసంత వేలం పాట నిర్వహించారు. సుమారు 30 మంది ఔత్సాహికులు వేలం పాటలో పాల్గొన్నారు. చెరువువాండ్లపల్లికి చెందిన హరీష్ రూ.3.13 లక్షలకు వారపు సంత హక్కులను దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి జనార్దన్ రెడ్డి తెలిపారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు బస్సులు

కదిరి అర్బన్: ఈనెల 22న అరుణాచలం గిరిప్రదక్షిణకు కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న శుక్రవారం ఉదయం 9 గంటలకు కదిరి డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సుల్లో కాణిపాకం, కంచి, స్వర్ణదేవాలయాలను కూడా దర్శించుకోవచ్చని తెలిపారు. ఎక్స్‌ప్రెస్‌లో పెద్దలు రూ.1,050, సూపర్ లగ్జరీలో రూ.1,300 చొప్పున చార్జీ చెల్లించాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9052537054 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆంజనేయ స్వామికి పూజలు


దాతలను సత్కరిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేపట్టారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాగణంలో ప్రతి శనివారం నిర్వహించే భజన, అన్నదాన కార్యక్రమాలకు నల్లచెరువు బీసీ హాస్టల్ వార్డెన్ కుంచపు లక్ష్మీనారాయణ, సాలెమ్మ దంపతులు రూ.10 వేలు, అలాగే పులిమివాండ్ల పల్లికి చెందిన సామల మాధవరెడ్డి, ఇందిర దంపతులు రూ.10 వేలను విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు సూర్య నారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

తనకల్లు: మండల పరిధిలోని ఎగువతొట్లిపల్లికి చెందిన నారాయణప్ప (65) అనే వృద్ధుడు తవళం వెళ్లే బ్రిడ్జి వద్ద మృతి చెందాడు. ఎస్ఐ ధరణిబాబు తెలిపిన వివరాలు.. నారాయణప్ప కొక్కంటి క్రాస్‌లోని అటవీశాఖకు చెందిన నర్సరీలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. అయితే రెండు రోజులుగా ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం బ్రిడ్జి సమీపంలో నారాయణప్ప మృతి చెందినట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బుక్కపట్నంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'



ర్యాలీ చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యాసాయి ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో కలిసి ఇంటింటికీ వెళ్లి చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. 3 సంవత్సరాలు నిండిన చిన్నారుల పేర్లను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందజేస్తామని తెలిపారు. అనంతరం చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఇటు ఇంగ్లిష్.. అటు తెలుగు

- రెండు మాధ్యమాల్లోనూ పాఠ్యాంశాలు
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మిర్రర్ ఇమేజ్ పుస్తకాల పంపిణీ
- పాఠ్యాంశాల్లోనూ మార్పులకు శ్రీకారం


పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు


ఒకవైపు ఇంగ్లిష్, మరోవైపు తెలుగులో ముద్రించిన పాఠ్య పుస్తకం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. మరింత ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఆంగ్ల మాధ్యమంతోనే ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనుగడ సాధ్యం. అందుకు తగ్గట్టుగా పాఠ్యాంశాల్లోనూ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆ పాఠ్యాంశాలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ భావించింది. ఈ క్రమంలో మూడేళ్ల కిందట ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ వస్తోంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం నుంచి పూర్తిగా 10వ తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం కొనసాగిస్తున్నప్పటికీ 2022–23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. విద్యార్థులు పాఠ్యాశాలు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలోనూ మార్పులు చేశారు. పుస్తకాల్లో ప్రతి పాఠ్యాంశాన్ని ఒక పక్క తెలుగు, మరోవైపు ఆంగ్లం (మిర్రర్ ఇమేజ్)లో ముద్రించడం విశేషం.

సులభంగా చదువుకునేందుకు అవకాశం


తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం చదవాలంటే కొంత ఇబ్బందే. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించారు. మూడేళ్ల కిందట 1–8 తరగతి వరకూ ప్రతి పుస్తకంలో అంటే నాన్ లాంగ్వేజ్ పుస్తకాలైన గణితం, సామాన్యశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం పుస్తకాల్లో అన్ని పాఠ్యాంశాలను ఒక పేజీలో తెలుగు, పక్క పేజీలో ఇదే పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను ఆంగ్లభాషలో ముద్రించారు. ఆ తర్వాత తొమ్మిదో తరగతి, తాజాగా ఈ ఏడాది పదో తరగతి పుస్తకాల్లో ప్రతి పాఠాన్ని రెండు భాషల్లోనూ ఇస్తున్నారు. ఇక ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకూ అన్ని పాఠ్య పుస్తకాల్లో రెండు మాధ్యమాల్లోనూ సులభంగా చదువుకునే అవకాశం ఉంటుంది. పదానికి అర్థం తెలియకున్నా పక్కనే ఉన్న పేజీలో తెలుగులో ఉండటంతో అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

రెండు సెమిస్టర్లుగా పుస్తకాలు..

ప్రతి పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకంలో పేజీల సంఖ్య రెట్టింపు కావడంతో విద్యార్థులకు బరువు పెరగకుండా ఉండేందుకు రెండు సెమిస్టర్లుగా విభజించారు. సగం పాఠాలను సెమిస్టర్–1, మిగతా సగం పాఠాలను సెమిస్టర్–2గా విభజించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో మొదటి భాగం, ఆ తర్వాత నవంబర్‌లో రెండో భాగం అందజేసి పాఠ్యాంశాలను బోధిస్తారు. మిర్రర్ ఇమేజ్ పుస్తకాలతో ప్రస్తుత విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతున్నప్పటికీ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ పుస్తకాల ముద్రణకే ప్రాధాన్యం ఇచ్చారు. సీఎస్ఈ వెబ్‌సైట్‌లో అన్ని మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలను విద్యార్థుల సౌకర్యార్థం పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచారు.

పాఠశాలలకు చేరిన పుస్తకాలు..

ధర్మవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం రూరల్‌తోపాటు ధర్మవరం మున్సిపాలిటీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 250 ఉన్నాయి. నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 98,739 పాఠ్య పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరాయి.


విద్యార్థులకు అర్థమయ్యేలా సూత్రాలను ముద్రించిన దృశ్యం


నూతనంగా ముద్రించిన పాఠ్య పుస్తకాలు

ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు..



మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలతో పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయి. ఇంగ్లిష్ మీడియంలో ఉన్న వాక్యానికి అదే అర్థం ఇచ్చే తెలుగు పక్క పేజీలోనే ఉండడం వల్ల విద్యార్థికి ఇంగ్లిష్‌పై పట్టు పెరుగుతోంది. మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు ఉపాధ్యాయుల బోధనకు, విద్యార్థులకు కంటెంట్‌ను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తున్నాయి. సాధారణ స్థాయి విద్యార్థికి కూడా ప్రయోజనం చేకూరుతుంది.

–గోపి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, శ్రీ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, సుందరయ్య నగర్, ధర్మవరం

చాలా ప్రయోజనకరం



ఈ ఏడాది పదో తరగతి పాఠ్య పుస్తకాలను మిర్రర్ ఇమేజ్ పుస్తకాలుగా మార్చారు. ద్విభాషా విధానంలోని పాఠ్యాంశాలతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్ల పట్టు కొంతమేర తక్కువగా ఉంటుంది. ఈ రకమైన విధానంతో పదో తరగతిలో మరిన్ని మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంది. – రాజేశ్వరి, గోపాల్ నాయక్, ఎంఈఓలు, ధర్మవరం

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం


సమావేశంలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు

ధర్మవరం అర్బన్: బక్రీద్ పండుగను పట్టణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం బక్రీద్ పండుగను పురష్కరించుకుని శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన విశ్వహిందూ పరిషత్ అనంతపురం జిల్లా విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ మాట్లాడారు. గోహత్య నిషేధం చట్టాలను వివరించారు. అక్రమంగా ఉన్న గోవధశాలలను వెంటనే మూసివేయాలని పోలీసులకు విన్నవించారు. గోవులను ఎక్కడా వధించకూడదని కోరారు. గోసంతతిని కూడా రైతుకు ఉపయోగపడకుండా ఉన్నవి, వయస్సు మీరిన పశువులను పశువైద్యాధికారి ధ్రువీకరించిన వాటిని మాత్రమే వధించాలన్నారు. బక్రీద్ పండుగను ముస్లింలు, హిందువులు ఐకమత్యంతో జరుపుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు, న్యాయవాదులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నల్లచెరువు: బక్రీద్ పండుగను ముస్లింలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ లింగన్న, తహసీల్దార్ రవికుమార్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అల్లుగుండు, కె.పూలకుంట గ్రామాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ముస్లిం మత పెద్దలు ఆయా గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి విద్వేషాలు రెచ్చగొట్టకుండా బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోవధకు పాల్పడకూడదని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

50 యూనిట్ల రక్తం సేకరణ


రక్షా అకాడమీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న రక్షా అకాడమీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అకాడమీ సిబ్బందితో పాటు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు రక్తదానం చేశారు. 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యాధికారి డా.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రక్షా అకాడమీ కల్నల్ కిరిత్ నాయర్, కమాండెంట్ నవీన్ త్యాగి, ఏజీఎం గోపకుమార్, నర్సింగ్ అధికారి నాగేశ్వర్ రెడ్డి, చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లా రిసోర్స్ అధికారి రమేష్, జోనల్ సూపర్‌వైజర్ వెంకట్, బ్లడ్ స్టోరేజీ సెంటర్ ల్యాబ్ టెక్నీషియన్స్ నంద కుమార్, సాహీరా బాను, లింక్ వర్కర్ హరి తదితరులు పాల్గొన్నారు.

నీలం రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివి

పెనుకొండ: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివని అధ్యాపకులు కొనియాడారు. శనివారం పట్టణంలోని స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి గతేడాది గుండెపోటుతో మరణించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, ప్రతాప్, హరీష్, బాబు, రామన్న తదితరులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కళాశాల అభ్యున్నతికి రమేష్‌రెడ్డి ఎంతో పాటుపడ్డారన్నారు. దివంగత ప్రిన్సిపాల్ స్మారకార్థం అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మడకశిరరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి సూచించారు. గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌లో ప్రథమ స్థానం మార్కులు సాధించిన విద్యార్థిని రమ్యకు శనివారం ఆయన రూ.3 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జంతువులను వధిస్తే చర్యలు

హిందూపురం: బక్రీద్ పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి జంతువులను వధిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను అనుసరించి లైసెన్సు పొందిన జంతు వధశాలలో మాత్రమే జంతువులను వధించాలని సూచించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై పెనుకొండ పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.8,960 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చే సుకున్నారు. 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యుడు డాక్టర్ బసవరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శిబిరానికి కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణులు జ్యోతివిజయ్‌కుమార్, పావగడ నుంచి సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార్ నాయక్, హిందూపురం నుంచి కంటి వ్యాధి నిపుణులు జింకా కృష్ణమోహన్ హాజరవుతారన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


మునగ పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని డివిజన్ ప్రకృతి వ్యవసాయం కో ఆర్డినేటర్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన ఆమిదాలగొంది పంచాయతీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వివిధ రకాల పంటలు, రైతు రామాంజనేయులు సాగు చేసిన మునగ పంటతో పాటు అంతర్ పంటగా 10 రకాల పంటను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానం, భూసార పరీక్షలు, పంట మార్పిడి, జీవామృతం, బీజామృతం తయారీ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల తనిఖీ

గోరంట్ల: మండలంలోని బూదిలి, గోరంట్లలోని మీ సేవా కేంద్రాలను నోడల్ ఆఫీసర్ శివారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మీసేవ కేంద్రాల ద్వారా పౌరసేవలు అందుతున్న వివరాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు సేవలకు తీసుకుంటున్న రుసుం తదితర వాటిపై వినియోగదారులతో ఆరాతీశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే సంబంధిత మీ సేవా నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మార్సీ ఆకస్మిక తనిఖీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి

అగళి: మండల కేంద్రంలోని విద్యశాఖ కార్యాలయంలో విద్యార్థులకు 2024–25 విద్య సంవత్సరానికి సంబంధించిన విద్యా సామగ్రిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ ఎన్ని పాఠ పుస్తకాలు వచ్చాయి? ఇంకా ఎన్ని రావాల్సి ఉన్నాయో ఎంఈఓ–2 చంద్రశేఖర్‌నాయుడును ఆరా తీశారు. డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ మండలంలోని 3,133 మంది విద్యార్థులకు సంబంధించి ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు 22,235, నోటు పుస్తకాలు 18,564, బెల్టులు 2189, వచ్చాయన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

గుడిబండ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల పర్యవేక్షణలో ప్రజాప్రతిధులు పాఠ్యపుస్తకాలను అందజేశారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, బ్యాగులు ఇతర సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అన్ని తరగతులకు సంబంధించి 130 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు హెచ్ఎం గోవిందప్ప తెలిపారు.

పనిముట్లు పంపిణీ చేయాలి

చిలమత్తూరు: ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చాగలేరు పంచాయతీ పరిధిలోని నంజిరెడ్డిపల్లి, పెద్దరెడ్డిపల్లి, చాగలేరు తదితర ప్రాంతాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. 100 రోజుల ఉపాధి పనులు పూర్తి చేసుకున్న వారికి పనిముట్లు మాత్రం ఇవ్వడం లేదన్నారు. నాలుగు వారాలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. నాలుగు మైళ్ల దూరం నడిచి కూలీ పనులకు వెళుతున్నారని తెలిపారు. వారికి కనీసం రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం అర్బన్: క్షణికావేశంలో తప్పులు చేస్తే ఇలా జైలు పాలు కావాల్సి వస్తుంది. కుటుంబంలో.. సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారు. అదే కాస్త ఓర్పుతో ఉంటే కాలమే సమాధానం చెబుతుందని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం హిందూపురం సబ్‌జైలును సందర్శించారు. ఏయే కేసుల్లో రావాల్సి వచ్చింది? న్యాయవాదిని నియమించుకొనే స్థోమత ఉందా లేదా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తాము ఎలాంటి తప్పు చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా పలు కేసుల్లో పోలీసులు ఇరికించారని న్యాయమూర్తి ఎదుట వాపోయారు. కేసుల్లో బయట పడిన తరువాత కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని వారు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నాగరాజురెడ్డి, వెంకటేష్, జైలు సూపరింటెండెంట్ అంజినాయక్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న ఆంజనేయుడు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో ఆంజనేయస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కేశవ మూర్తి స్వామి వారికి సుప్రబాతసేవ, తైలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన తమలపాకుతో ఆకు అలంకరణతో పాటు పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మండలం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, వడి బియ్యంతో పాటు బంగారు ఆభరణాలతో పాటు పూలతో లక్ష్మీదేవి సమేతంగా వెండి కవచంతో నరసింహస్వామిని అర్చకులు విశేషంగా అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. స్థానికులు, చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా దేవదాయ శాఖ అధికారి బి.నరసింహరాజు పర్యవేక్షణలో హుండీకానుకలను లెక్కించారు. 105 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించగా రూ.4,47,374 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఆయల కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.